
సాక్షి
బాపట్ల
మంగళవారం। 15। ఏప్రిల్। 2025



ఆలయ నిర్మాణానికి విరాళం


నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి గుడి పునర్నిర్మాణానికి చిలకలూరిపేటకు చెందిన తోట రవికుమార్, సునీత దంపతులు రూ.1,01,116 విరాళంగా అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు నీటిని నిలుపుదల చేశారు.

ఆంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మాచవరం గ్రామంలోని నల్లంత ఆంజనేయ స్వామి తిరునాళ్లను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

వక్ఫ్ సవరణ చట్టం రద్దు కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన



నరసరావుపేట: భారత రాజ్యాంగం కాపాడాలని, వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం పట్టణంలోని గడియార స్తంభం వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత, పేద మధ్యతరగతి ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లిం సంఘాలు, సీపీఎం, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ముస్లిం మైనార్టీ నాయకులు మస్తాన్‌వలి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముస్లింల అణచివేతకు పాల్పడుతుందన్నారు. ఒక్క ముస్లింను కూడా కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గంలో నియమించలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఎం నాయకులు డి.శివకుమారి, పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, అమరావతి రజక ఐక్యవేదిక నాయకులు ఉదయగిరి వెంకటస్వామి, మైనారిటీ నాయకులు మాదిన రసూల్ రఫీ, వర్లమాబు, కరీముల్లా, ఖలీల్, మెకానిక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ



నరసరావుపేటటౌన్: జాగ్రత్తలు పాటించటంతో అగ్ని ప్రమాదాలు అరికట్టవచ్చని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో గతేడాది 530 ప్రమాదాలు చోటుచేసుకోగా రూ.6.62 కోట్లు ఆస్తి నష్టం జరిగిందన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సకాలంలో స్పందించి రూ.22.57 కోట్ల విలువైన ఆస్తిని కాపాడన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, బహుళ అంతస్తుల భవనాలు, ఆసుపత్రులు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంలు, రద్దీ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట అగ్నిమాపక శాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గోవర్ధనస్వామి ఆలయ బ్రహోత్సవాలు



నాదెండ్ల: నాదెండ్లలో కొలువై ఉన్న చారిత్రాత్మక ఆలయమైన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ గోవర్ధనస్వామి, భూనీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి వార్ల దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు స్వామివారి ధ్వజారోహణ నిర్వహించారు. ఈ నెల 8న ప్రారంభమైన బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివార్లకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం సాయిశ్రీనివాసాచార్యులు, విజయరామాచార్యులు, సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమాలను ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాదాయశాఖ ఈవో శ్రీనివాసు పర్యవేక్షించారు.

గంజాయి అమ్మకాలపై నిఘా ఉంచాలి



నెహ్రూనగర్: ప్రభుత్వం తలపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 28 గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాస్ తెలియజేశారు. సోమవారం బ్రాడీపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖకు సంబంధించిన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టి పట్టణ, మున్సిపల్ ప్రాంతాల్లో అమ్మకాలపై కేసులు నమోదు చేయాలన్నారు.

ఏదీ వదలకొండ

- కొండలు కొల్లగొడుతున్నారు
- ఇసుకదర్శి కొండల నుంచి గ్రావెల్ అక్రమ రవాణా
- వాడరేవు–పిడుగురాళ్ల రహదారికి గ్రావెల్ అమ్మకం
- జిల్లాలో రియల్ వెంచర్లు, ఇతర అవసరాలకు ఇక్కడి నుంచే గ్రావెల్
- పెద్దపెద్ద యంత్రాలు పెట్టి రేయింబవళ్లూ తవ్వకం
- వందలాది టిప్పర్లతో తరలింపు
- పచ్చనేత క్యాంపు కార్యాలయానికి ట్రిప్పుకు రూ.1,000 కప్పం
- దందా నడిపిస్తున్న పచ్చనేత అనుచరుడు
- అనుమతులు ఉన్న గ్రావెల్ లీజులు రద్దు చేయించిన వైనం



మార్టూరు మండలం ఇసుకదర్శి కొండ ప్రాంతాల నుంచి గ్రావెల్ అక్రమ రవాణా

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికార పార్టీ నేతలు బరితెగించారు. ఇసుక, మట్టి, గ్రావెల్, గ్రానైట్, రేషన్ అన్న తేడా లేకుండా ఏది దొరికినా సరే కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారు. అక్రమార్జనకు కాదేదీ అనర్హం అన్న రీతిలో తెగబడుతున్నారు. ఈ వ్యవహారంలో పర్చూరు ముఖ్య నేతది ప్రత్యేక స్థానం. నియోజకవర్గంలో ఉన్న ప్రకృతి వనరులన్నింటినీ ఎలా దోచుకు తినాలో ఆయనకు తెలిసినంతగా రాష్ట్రంలో మరెవరికీ తెలియదనుకోవాలి. పర్చూరులో ఉన్న ఇసుక, గ్రానైట్‌ను నిత్యం అక్రమంగా తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్న పచ్చనేత నియోజకవర్గంలోని ఇసుకదర్శి కొండలను పిండి చేసి గ్రావెల్ అమ్ముకుంటున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల పన్నులకు గండి కొట్టి సొంత లాభం చూసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడంలేదు. పర్చూరు నియోజకవర్గంలో పచ్చనేత అనుచరులు గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. పదినెలల కూటమి పాలనలో మైదాన ప్రాంతంలో ఉన్న గ్రావెల్ మట్టిని తరలించి అమ్ముకున్న నేతల కన్ను ఇప్పుడు ఏకంగా మార్టూరు మండలం ఇసుకదర్శి, వలపర్ల గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూములు, కొండలపై పడింది. పెద్దపెద్ద యంత్రాలు పెట్టి రేయింబవళ్ల గ్రావెల్ తవ్వి వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారికి అమ్ముతున్నారు. కొంత గ్రావెల్‌ను పర్చూరు, చీరాల, బాపట్ల ప్రాంతాల్లోని రియల్ వెంచర్లు, ఇతర అవసరాలకు సరఫరా చేస్తున్నారు. రోజుకు 300 నుంచి 400 టిప్పర్ల గ్రావెల్ తరలిస్తున్నారు. ఐదు యూనిట్ల గ్రావెల్ టిప్పర్ రూ.15 వేలకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. డిమాండ్‌ను బట్టి రియల్ వెంచర్లు ఇతర అవసరాలకు ఎక్కువ ధరకు సైతం విక్రయిస్తున్నారు. పర్చూరు పచ్చనేత అనుచరులు ఈ దందాను నిర్వహిస్తుండగా తరలిస్తున్న గ్రావెల్‌కు ఒక్కో ట్రిప్పుకు రూ.1,000 చొప్పున పచ్చనేత క్యాంపు కార్యాలయానికి కప్పంగా చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. వాడరేవు–పిడుగురాళ్ల రహదారి నిర్మిస్తున్న కాంట్రాక్టర్ వేరెవరివద్ద గ్రావెల్ కొనకుండా పచ్చనేత వారిపై ఒత్తిడి తెచ్చి తన గ్రావెల్ విక్రయిస్తున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక, గ్రానైట్, గ్రావెల్ మూడు దందాలను పచ్చనేత అనుచరుడిగా ఉన్న తెలంగాణ రాష్ట్రం కంభం జిల్లాకు చెందిన శ్రీకాంత్ నడిపిస్తున్నట్లు సమాచారం.



మార్టూరు హైవే మీదుగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు

గతంలో ఉన్న లీజులను రద్దు చేయించి అక్రమ దందా

గత ప్రభుత్వంలో ఉన్న లీజులతో ప్రభుత్వానికి రాబడి ఉండేది. సదరు లీజుల నుంచి గ్రావెల్ తరలించి అవసరమున్న చోటుకు అమ్మేవారు. దీనివల్ల ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వచ్చేది. తద్వారా జిల్లాకు, మైనింగ్ పరిధిలోని గ్రామ పంచాయతీలకు నిధులు సమకూరేవి. వాటితో అభివృద్ధి పనులు చేపట్టేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక పచ్చనేత మార్టూరు మండలం బొబ్బేపల్లి, కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఉన్న లీజులను ఉద్దేశపూర్వకంగా రద్దు చేయించారు. కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి ప్రాంతాల లీజులను రద్దు చేయకపోయినా అధికారం అడ్డుపెట్టి అక్కడ మైనింగ్ జరగకుండా నిలిపి వేయించారు. తాను మాత్రం వలపర్ల, ఇసుకదర్శి తదితర అటవీప్రాంతాల నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలించి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. పర్చూరు నేత అక్రమ గ్రావెల్ దందాతో ప్రభుత్వ రాబడికి రూ.కోట్లలో గండి పడుతోంది. అయినా సంబంధిత శాఖలు అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

డాక్టర్ బీఆర్.అంబేడ్కర్

గొప్ప ఆర్థికతత్వవేత్త

- ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్
- ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

బాపట్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప ఆర్థికతత్వవేత్తగా ఎదిగి భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించారని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో సభ నిర్వహించారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినీలు జై భీమ్,... జై భీమ్ అంబేడ్కర్ అంటూ... కోలాట నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించి బైపీసీలో 975 మార్కులు సాధించిన చీరాల విద్యార్థినీ కె ధాత్రి, ఎంపీసీలో 975 మార్కులు సాధించిన పర్చూరుకి చెందిన విద్యార్థిని సమీరాలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున నగదు బహుమతులను కలెక్టర్ అందజేశారు. ఇటీవల యాజిలి గ్రామంలోని నీటి కుంటలో పడి మృతి చెందిన ఎస్సీ బాలుడు జి ప్రవీణ్ తల్లి అమృతకు కలెక్టర్ రూ.10వేల చెక్కు అందించారు. ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక సాధికారతతోనే సమానత్వం లభిస్తుందని ఉద్యమాలు చేసిన గొప్ప నాయకుడు అంబేడ్కర్ అన్నారు. సమానత్వం కోసం రాజ్యాంగంతో చట్టాలు రూపొందించారని పేర్కొన్నారు. ఎన్నో ఒత్తిళ్లు వచ్చినప్పటికీ రిజర్వేషన్లు సాధించి పెట్టారని ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ పేదరికం, అంటరానితనాన్ని ధైర్యంగా ఎదుర్కొన్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విద్యతో మేధావిగా చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. మట్టిలో మాణిక్యం, ఆణిముత్యంలా... సమాజానికి దిక్సూచిలా మారారన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ సామ్యవాదంతో ప్రపంచ మార్గదర్శకుడిగా అంబేడ్కర్ నిలిచారని అన్నారు. చిన్నతనంలోనే అంబేడ్కర్ అస్పృశ్యతపై ఉద్యమించారన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని రాజా దెబోరా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డీపీఓ ప్రభాకర్, ఆర్డీవో పి గ్లోరియా, ఎస్సీ నాయకులు జి.చార్వాక, మాణిక్యరావు, లక్ష్మీనరసయ్య, పల్నాడు శ్రీరాములు, ఎస్టీ నాయకులు ఎన్ మోహన్‌కుమార్ ధర్మ, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్లను స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సోమవారం విడుదల చేశారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. వాటిని నివారించడానికి ముందస్తు అవగాహన చర్యలు ముఖ్యమన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారించాలని, గృహాలలో ప్రమాదాలు అరికట్టాలన్నారు. కర్మాగారాలు, గిడ్డంగులు, తాత్కాలిక నిర్మాణాలు, పందిళ్ల ద్వారా ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ద్వారా ఏప్రిల్ 14 నుంచి 20 తేదీ వరకు జరగనున్న అగ్నిమాపక వారోత్సవాలలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అగ్ని ప్రమాదాలు అరికట్టడానికి అందరి సహకార కావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సేవల శాఖ అధికారి సి మాధవనాయుడు, ఫైర్ ఆఫీసర్ వై వెంకటేశ్వరరావు, డీపీఓ ప్రభాకర్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ రామకృష్ణ, ఎల్‌డీఎం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక వారోత్సవాల గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

అకాల వర్షంతో

నేలవాలిన పంటలు



కొప్పరపాడులో నేలవాలిన మొక్కజొన్న

బల్లికురవ: ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికందే దశలో ఈదురుగాలుల వర్షం ధాటికి నేలవాలాయి. ఆదివారం సాయంత్రం మండలంలోని కొప్పరపాడు, వైదన, కొమ్మినేనివారిపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, ఎల్‌ఎల్‌గుడిపాడు, అంబడిపూడి, బల్లికురవ గ్రామాల్లో వర్షం, గాలి ప్రభావంతో కండె దశలో ఉన్న మొక్కజొన్న నేలావాలింది. ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టామని దిగుబడులు ఆశాజనకంగా ఉన్న పరిస్థితిలో నష్టాలు మిగిల్చాయని రైతులు వాపోయారు. పైగ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపోయిన పంటలను పరిశీలించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

గాలివానతో నేలవాలిన మొక్కజొన్న

జే పంగులూరు: ఆదివారం సాయంత్రం మండలంలోని కొన్ని గ్రామాల్లో గాలితో కూడిన వర్షం పడటంతో మొక్కజొన్న రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని ఏఓ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం గాలివానతో నొలకొరిగిన మొక్కజొన్న పంటను, కారణంగా తడిచిన మొక్కజొన్నను ఏఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం, మంగళవారం, బుధవారాలు వరకు వాతావరణ శాఖ దక్షిణ కోస్తా జిల్లాలో గాలి, ఉరుములతో కూడిన వర్షం పడే సూచనలు ఉన్నాయని హెచ్చరికలు జారీ చేశారన్నారు. కల్లాలో ఉన్న పంటలను జాగ్రత్త పరుచుకోవాలని తెలిపారు. వీలైతే పంట కోతలు బుధవారం వరకు వాయిదా వేయాలని ఆయన సూచించారు.

బొప్పాయి, అరటి తోటలకు తీవ్ర నష్టం

అద్దంకి: వేసవిలో కురిసిన గాలి వానకు సంతమాగులూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉద్యాన రైతుకు నష్టం కలిగింది.అ అలాగే అద్దంకి మండలంలోని రామాయపాలెం, తిమ్మాయపాలెం, అద్దంకి, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల్లో పచ్చి ఇటుక వర్షానికి తడిసిపోయింది. ఒక్కో బట్టీల్లో కనీసం రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు నష్టం జరిగిందని యజమానులు తెలిపారు. ఇక సంతమాగులూరు మండలంలోని సంతమాగులూరు, మక్కెనవారిపాలెం గ్రామాల్లో సాగు చేసిన బొప్పాయి, అరటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.



సంతమాగులూరు మండలంలో నేలకొరిగిన అరటి తోట

పాలకుల పాపం

- వర్గపోరుతో సతమతం
- బీసీ, ఎస్సీలంటే చిన్నచూపు
- బలహీనవర్గాలైతే సస్పెన్షన్
- అధికారపార్టీ సామాజికవర్గమైతే వీఆర్‌తో సరి!
- వివక్షపై మండిపడుతున్న పోలీసు సిబ్బంది
- బోరుగడ్డ అనిల్, గోరంట్ల మాధవ్ కేసుల్లో బలి చేసింది బలహీనవర్గాలనే

పోలీసు శాఖకు శాపం



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పాలకుల పాపం పోలీసు శాఖకు శాపంగా మారుతోంది. రాజు గారి బిడ్డను ఎత్తుకున్నా తప్పే... దింపినా తప్పే అనే చందాన గుంటూరు రేంజ్ ఐజీ వ్యవహారం తయారైంది. ఏదైనా ఘటన జరిగినప్పుడు తెలుగుదేశం పార్టీ సామాజికవర్గం వారైతే వీఆర్‌కు పిలవడం, తర్వాత పోస్టింగ్ ఇవ్వడం.. అదే బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలైతే సస్పెన్షన్‌కు గురి చేయడం రేంజ్‌లో చర్చనీయాంశంగా మారింది. రెండురోజుల క్రితం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అరెస్టు చేసినప్పుడు తన లాయర్‌తో ఫోన్‌లో మాట్లాడారన్న సాకుతో ఒక బీసీ వర్గానికి చెందిన సీఐతోపాటు బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన ఎస్ఐలు, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. అదే సమయంలో అక్కడే ఉన్న కూటమి సామాజికవర్గం సీఐపై చర్యలు తీసుకోకపోవడాన్ని సిబ్బంది ఎత్తిచూపుతున్నారు.

ఇటీవల పెరిగిన సస్పెన్షన్లు

చిన్నాచితక వ్యవహారాలకు కూడా ఎటువంటి సమాచారం లేకుండా, వివరణ తీసుకోకుండా సస్పెన్షన్ వేటు వేయడం ఇటీవల గుంటూరు రేంజ్ పరిధిలో ట్రెండ్‌గా మారిందనే వాదన వినిపిస్తోంది. ఇటీవల అరెస్టు చేసిన గోరంట్ల మాధవ్‌ను వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లిన సమయంలో కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, అరండల్‌పేట సీఐ వీరాస్వామి, పట్టాభిపురం ఎస్సై రాంబాబు, నగరంపాలెం ఎస్సై ఆంజనేయులతోపాటు ఏఆర్ పోలీసులు, సిబ్బంది బందోబస్తుగా వెళ్లారు. అయితే వైద్య పరీక్షల సమయంలో లాయర్‌తో మాట్లాడేందుకు మాధవ్ తన అనుచరుల వద్ద ఫోన్ తీసుకుని మాట్లాడుతుండగా ఈ విషయాన్ని గుర్తించిన అరండల్‌పేట సీఐ వీరాస్వామి దానిని లాక్కున్నారు. అయితే ఫోన్ మాట్లాడే వరకు ఎందుకు ఊరుకున్నారనే సాకుతో ఈ వ్యవహారంలో ఎస్సీ, బీసీలు అయిన అరండల్‌పేట సీఐ వీరాస్వామితోపాటు ఎస్సై రాంబాబు, ఎస్సై ఆంజనేయులు, మరో తొమ్మిది మంది కిందిస్థాయి సిబ్బందిని సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే అక్కడే మౌనంగా ఉన్న కొత్తపేట సీఐ వీరయ్య చౌదరిపై మాత్రం ఏ చర్యలూ తీసుకోలేదు. దీనిపై పోలీసు శాఖలో విస్మయం వ్యక్తమవుతోంది. ఇటీవల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్యనూ వీఆర్‌కు పంపడం చర్చకు దారితీసింది. సీతారామయ్య బాధ్యతలు తీసుకున్న దగ్గర నుంచి ఆయనను సాగనంపేందుకు అధికారపార్టీ సామాజికవర్గానికి చెందిన సీఐలు, ఎల్లో మీడియా చేయని యత్నాలు లేవని తెలుస్తోంది.

బీసీ ఎస్సీలే సమిధలు..!

పోలీసు శాఖలో బీసీలు, ఎస్సీలే సమిధలవుతున్నారు. గతంలోనూ బీసీ, ఎస్సీ పోలీసు అధికారులపై పోలీసు ఉన్నతాధికారులు వేటు వేశారు. నాలుగు నెలలల క్రితం పశ్చిమ ఎమ్మెల్యే కోపంగా ఉన్నారంటూ ఎల్లో మీడియాలో వార్త రాగానే నగరంపాలెం సీఐ వీరానాయక్‌ను వీఆర్‌కు పిలిచారు. పట్టాభిపురం స్టేషన్‌కు పోస్టింగ్ వచ్చిన 24 గంటల్లోనే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మధుసూదనరావును వీఆర్‌కు పిలిచి అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన గంగా వెంకటేశ్వర్లుకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే చిన్న విషయాన్ని సాకుగా చూపి డీసీఆర్‌బీ సీఐ బిలాలుద్దీన్‌ను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే రేంజ్ పరిధిలోని రాపూరు స్టేషన్ అధికారిపై ఆరోపణలు వచ్చినా అధికార పార్టీ సామాజిక వర్గం కావడంతో చర్యలు తీసుకోకుండా వీఆర్‌కు పిలిచి ఊరుకున్నారు. అధికారపార్టీ అనుకూలురు అయితే ఒకలా.. మరో వర్గం వారైతే మరోలా పోలీసుశాఖ ఉన్నతాధికారులు వ్యవహరించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే..!

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పోలీసు శాఖ ఒక వర్గానికి కొమ్ముకాస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఐజీ కూడా అధికార పార్టీకి వంతపాడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరుకు చెందిన బోరుగడ్డ అనిల్‌కు పోలీసుస్టేషన్‌లో రాచమర్యాదలు చేశారన్న విషయంలోనూ బీసీ, ఎస్సీ, మైనారిటీ సిబ్బందిపైనే సస్పెన్షన్ వేటు వేశారు. అప్పట్లో అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన సీఐ కుంకా శ్రీనివాసరావును వీఆర్‌కు పిలిచి కొద్ది కాలానికి కీలకమైన రాజధాని ప్రాంతానికి సీఐగా బదిలీ చేశారు. అదే సమయంలో సస్పెండ్ అయిన వారిపై సస్పెన్షన్ ఎత్తివేయలేదు. ఈ నేపథ్యంలో మనోవ్యథతో మైనారిటీ వర్గానికి చెందిన ఒక కానిస్టేబుల్ మృతి చెందారు.

కడచూపునకు వస్తూ కడతేరే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- నానమ్మ మరణ వార్త విని వస్తుండగా దుర్ఘటన
- శోకసముద్రంలో మునిగిన కుటుంబం

యద్దనపూడి: నాయనమ్మ మరణించిందని తెలిసి కడచూపుకు వస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ హృదయ విదారక ఘటన యద్దనపూడి మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చిలకలూరిపేట పోలిరెడ్డిపాలెం ఎదురుగా ఉన్న లక్ష్మీనర్సింహకాలనీకి చెందిన మక్కెన శ్రీనివాసరావు దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో చిన్నవాడైన శివరామకృష్ణ(28)కి ఏడాదిన్నరక్రితం సమీప బంధువు నందినితో పెళ్లయింది. శివరామకృష్ణ విజయవాడలోనే ఉంటూ ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం చిలకలూరిపేట రూరల్ మండలం అప్పాపురం గ్రామంలో ఉన్న నాయనమ్మ సుబ్బులమ్మ చనిపోయిందన్న వార్త తెలిసి చూసేందుకు బైక్‌పై బయలుదేరాడు. యద్దనపూడి గ్రామంలోని ఎన్ఎస్ఎల్ నూలుమిల్లు వద్ద ఫ్లై ఓవర్ వద్దకు రాగానే ఎదురుగా వెళ్తున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో బైక్ అదుపు తప్పి ఆ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శివరామకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు శివరామకృష్ణను విజయవాడ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే సుబ్బులమ్మ భౌతికకాయాన్ని చూసేందుకు తరలివచ్చిన బంధుమిత్రులు సోమవారం ఉదయం ఆమెకు అప్పాపురం గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. శివరామకృష్ణకు చిలకలూరిపేటలో అంత్యక్రియలు జరిగాయి.

క్లుప్తంగా

మే 5 నుంచి టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మే నెల 5వ తేదీ నుంచి ఉమెన్స్ టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని, వయస్సు 19 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతోపాటు, ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ-2025 ద్వారా భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు బుధవారం ఉదయం 10 గంటలకు బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదిత్య కాంపిటీషన్స్ డైరెక్టర్ కె.ప్రణయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతోపాటు ఇతర అధ్యాపకులు ఆయా సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. సదస్సులో పాల్గొనే ప్రతి అభ్యర్థికీ సైకాలజీ పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తామని, ఇతర వివరాలకు 98490 03166, 91105 88864 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

17 వరకు డైట్ టెండర్ల స్వీకరణ

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయం పరిధిలో తెనాలి జిల్లా వైద్య పరిషత్‌లో రోగులు, విధుల్లో ఉన్న వైద్యులకు ఆహారం సరఫరా చేసేందుకు ఈనెల 17 వరకు టెండరు ఫారాలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బండారు వెంకట రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన టెండరు ఫారాలు 17వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు గుంటూరు పట్టాభిపురంలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో టెండరు బాక్సులో వేయాలని ఆయన సూచించారు.

పచ్చ పార్టీ కాంట్రాక్టర్ నిర్వాకం

- కారును పక్కకు తీయకుండా సిమెంట్ రోడ్డేసిన వైనం
- కాంట్రాక్టర్‌కి సహకరించిన పంచాయతీ అధికారులు
- లబోదిబోమంటున్న కారు ఓనర్
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



రూపా ఆనంద్



కారును సిమెంట్ రోడ్డులో ఉంచి రోడ్డు నిర్మాణం చేసిన కాంట్రాక్టర్

వేటపాలెం: మా ప్రభుత్వం .. మేము చేసిందే కరెక్టు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు పచ్చ పార్టీ నాయకులు. ఆ పార్టీకి చెందిన కాంట్రాక్టర్ కూడా అదే రీతిలో వ్యవహరించాడు. దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నంలో మూడు వీధుల్లో ఎన్ఆర్‌జీఈఎస్ నిధులతో నూతనంగా ఆదివారం సిమెంట్ రోడ్లు వేశారు. అయితే, ఈ రోడ్డు వేస్తున్న వీధిలో నివాసం ఉంటున్న యర్రా రూపా ఆనంద్ అభ్యంతరం తెలిపాడు. రోడ్డికిరువైపులా పంచాయతీ స్థలం ఆక్రమణకు గురై వెడల్పు తగ్గి పోయిందని పంచాయతీ కార్యదర్శికి ఐదు నెలల కిందట ఫిర్యాదు చేశారు. వేటపాలెం తహసీల్దార్‌కి గత ఏడాది నవంబర్ 2 రోడ్డు సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని దాని నిమిత్తం చలానా కట్టి అర్జీ కూడా ఇచ్చారు. అది ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. సర్వే ఊసే లేదు. అనంతరం రోడ్డు సర్వేపై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 7న ఆనంద్ ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కూడా రోడ్డు ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించలేదు.

సెలవు దినాల్లో హడావుడిగా రోడ్డు నిర్మాణం

ఆ కాంట్రాక్టర్ ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం రోజైన ఆదివారం హడావుడిగా ఆమోదగిరి పట్నంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేశాడు. దీనికి సంబంధించి యర్రా రూపా ఆనంద్‌కి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. అదే రోడ్డులో నివసిస్తున్న ఆయన ఇంటి పక్కనే సొంత స్థలంలో రోడ్డు మీద కారు పార్కు చేసి ఉంచారు. ఈ క్రమంలో రూపా ఆనంద్ కుటుంబ సభ్యులు గుంటూరులో చికిత్స పొందుతుంటే వారిని పరామర్శించడం కోసం ఆదివారం ఉదయం వెళ్లారు. రాత్రికి తిరిగి వచ్చే చూసే సరికి ఇంటి పక్కన తన స్థలంలో రోడ్డు పక్కన పార్కు చేసి ఉంచిన కారు కిందగా కొత్తగా సిమెంట్ రోడ్డు వేశారు. ఇది చూసిన ఆనంద్ ఒక్కసారిగా కంగుతిన్నాడు. కారు ముందు టైరు సిమెంట్ రోడ్డులో ఇరుక్కుపోయింది. కారుపై సిమెంట్ వ్యర్థాలు సైతం పడ్డాయని ఆరోపించారు. రూపా ఆనంద్ వెంటనే తనకు జరిగిన అన్యాయంపై వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్‌కి, ఎస్పీ ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సోషలిస్ట్ నేత మోదుగుల పాపిరెడ్డికి ఘన నివాళి



పాపిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

- దశ దిన కర్మకు హాజరైన ప్రముఖులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ

గుంటూరు రూరల్: సోషలిస్ట్ పార్టీ నేత మోదుగుల పాపిరెడ్డి(88) దశదిన కర్మకు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. సోమవారం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని రెడ్డిపాలెం వద్ద ఉన్న ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి నివాసంలో పాపిరెడ్డి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మోదుగుల కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. పాపిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మర్రి రాజశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు, వైఎస్సార్ సీపీ పొన్నూరు, ప్రత్తిపాడు, వేమూరు, సత్తెనపల్లి, మంగళగిరి సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్‌కుమార్, వరికూటి అశోక్‌కుమార్, గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, దొంతిరెడ్డి వేమారెడ్డి, కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబులతో పాటు భాష్యం రామకృష్ణ, నన్నపనేని రాజకుమారి, కోవెలమూడి రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీలు జేడీ శీలం, వై.శివాజీ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు యువతకు ఆదర్శనీయం

ఎస్పీ తుషార్ డూడీ



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల టౌన్: అంబేడ్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. అంబేడ్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ దేశంలో అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడానికి అంబేడ్కర్ విశేష కృషి చేశారని తెలిపారు. భారతదేశ రాజ్యాంగానికి దిశా నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారని చెప్పారు. నాడు అంబేడ్కర్ ఎన్నో అవమానాలు ఎదుర్కొని ప్రపంచ మేధావి అయ్యారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని తెలిపారు. సమాజంలో కుల, మత, వర్గ, లింగ వివక్షను ఎప్పుడైతే విడనాడతామో అప్పుడే అభివృద్ధి చెందుతుందని వివరించారు. అంబేడ్కర్ చెప్పిన విధంగా "మనమంతా భారతీయులం, మనమంతా ఒక్కటే" అనే నినాదంతో జీవించాలని, అదే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. అంబేడ్కర్ పేద కుటుంబంలో పుట్టి, ఎంతో కష్టపడి చదివి, ఎన్నో కష్టనష్టాలకు ఎదురొడ్డి ఉన్నతస్థాయికి చేరుకున్నారని ఎస్పీ వివరించారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయ వేత్తగా, రాజ్యాంగ నిర్మాతగా అన్నిటికి మించి సామాజిక సంస్కర్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సీసీ హరికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ సమానత్వం అంబేడ్కర్‌తోనే సాధ్యం



నరసరావుపేట: రాజ్యాంగంలో అందరికీ సమానత్వం కల్పించిన మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ అని ఎస్పీ కంచి శ్రీనివాసరావు కొనియాడారు. భారతరత్న అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రపంచ దేశాలలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం రచించి ఆయన దేశానికి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, సమానత్వం, మానవ హక్కులు, విద్యా స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన కృషి అనిర్వచనీయమైందని ఎస్పీ అన్నారు. . ఆయన చూపిన సమానత్వం, న్యాయం, సౌభ్రాతత్వం వంటి రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, పోలీస్ సిబ్బంది అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యోగ నిర్వహణ చేయాలని సూచించారు. అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, అడ్మిన్ ఆర్.ఐ రాజా, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అన్ని వీఆర్వో సంఘాలతో ఐక్య కార్యాచరణకు సిద్ధం

- ఏపీజీఈఏ అనుబంధ వీఆర్వోల సంఘ నాయకుడు భూపతిరాజు రవీంద్ర రాజు
- గతంలో ఏపీజేఏసీ అమరావతి, వారి అనుబంధ వీఆర్వోల సంఘంపై అనుచిత వ్యాఖ్యలు చేశానని వెల్లడి
- బహిరంగ క్షమాపణలు చెప్పిన రవీంద్రరాజు
- స్వాగతించిన ఏపీజేఏసీ అమరావతి అనుబంధ వీఆర్వోల సంఘం

గుంటూరు మెడికల్: ఏపీజేఏసీ, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘంతో కలిసి పని చేస్తామని ఏపీజీఈఏ అనుబంధ వీఆర్వోల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం గుంటూరులోని ఏపీఎన్జీవోస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రవీంద్రరాజు వెల్లడించారు. గతంలో ఏపీజేఏసీ, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘంపై అనుచిత వ్యాఖ్యలతోపాటు వారి కార్యకలాపాలకు ఆటంకం కలిగించామని, దీనికి బహిరంగంగా క్షమాపణలు తెలియజేస్తున్నానని తెలిపారు. తొలుత ఏపీజీఈఏ అనుబంధ వీఆర్వో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రవీంద్రరాజు ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ రావడంపై చర్చించేందుకు ఆ సంఘ నాయకులు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీజేఏసీ అమరావతి, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘ నాయకులు అనుపమ, అయూబ్‌తో పాటు ఏపీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్, ఇతర గుంటూరు జిల్లా సంఘ నాయకులు, భూపతి రవీంద్ర రాజు వద్దకు వెళ్లి నిలదీశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించవద్దని సూచించారు. ప్రస్తుతం వీఆర్వోలపై పని భారం ఎక్కువగా ఉందని, ఇలాంటి విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామని సూచించారు. లేదంటే ఈ సమావేశాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దీంతో భూపతి రవీంద్ర రాజు ఏపీజేఏసీ అమరావతి, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘ నాయకులకు క్షమాపణలు చెప్పారు. ఇకపై ఏపీజేఏసీ అమరావతి, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘంతో కలిసి పని చేస్తామని ప్రకటించారు. దీనిపై త్వరలో ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని ఏపీజేఏసీ అమరావతి, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘం నాయకులు స్వాగతించారు. కార్యక్రమంలో ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంటు రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్, ఏపీవీఆర్వోల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ, ప్రచార కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అయూబ్, కోశాధికారి నాగేశ్వరరావు, మహిళా కార్యదర్శులు చిన్నారి, శ్రీలక్ష్మీ, గుంటూరు తూర్పు మండల అధ్యక్షులు అరుణ్, ఉపాధ్యక్షుడు రామ్ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సంగీతరావు, వంశీ, పొన్నూరు మండల కార్యవర్గ సభ్యులు బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మార్టూరు: ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందింది. ఈఘటన మార్టూరు బలరాం కాలనీ సమీపంలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. జే.పంగులూరు మండలం కోడుమూరు గ్రామానికి చెందిన ఎం.పద్మ (55) ఇటీవల భర్తకు గుండె ఆపరేషన్ జరగడంతో మార్టూరులో నివాసం ఉంటున్న కుమార్తె వద్దకు భార్యాభర్తలు ఇద్దరూ విశ్రాంతి నిమిత్తం వచ్చి ఉంటున్నారు. ఈక్రమంలో సోమవారం ఉదయం వేడి నీటి కోసం వాటర్ హీటర్ ఆన్ చేసిన పద్మ విద్యుదాఘాతానికి గురైంది. కొనఊపిరితో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెనిగండ్లలో ఏడు కిలోల వెండి, నగదు చోరీ

పెదకాకాని: గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంటిలో ఉన్న వెండి, నగదు దోచుకెళ్లిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామానికి చెందిన దుంపగుంట్ల రామకృష్ణ కుటుంబం ఈనెల 10న బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లింది. సోమవారం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువా తలుపులు తీసి అందులో ఉన్న ఏడు కిలోల వెండి వస్తువులు, రూ.50 వేల నగదు మాయమైంది. చోరీ జరిగిన విషయం పోలీసులకు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కానిస్టేబుల్ అదృశ్యం



ఫారుఖ్ (ఫైల్)

మంగళగిరి టౌన్: కానిస్టేబుల్ అదృశ్యంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆక్టోపస్‌లో కానిస్టేబుల్‌గా ఫారుఖ్ విధులు నిర్వహిస్తున్నాడు. మంగళగిరి పట్టణ పరిధిలోని టిప్పర్ల బజార్‌లో గత కొంతకాలంగా కుటుంబంతో కలసి ఉంటున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు. వైజాగ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్ ఉందంటూ ఫారుక్ ఈ నెల 8వ తేదీన బయలుదేరి వెళ్లాడు. ఆ మరుసటి రోజు సాయంత్రం 6 గంటల సమయంలో భర్తకు ఫోన్ చేశానని, ఆ సమయంలో వైజాగ్‌లోనే ఉన్నానని చెప్పినట్లు బషీరున్ ఫిర్యాదులో పేర్కొంది. 10వ తేదీ ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. మళ్లీ రెండు రోజుల తరువాత ఫోన్ చేసినా స్విచ్చాఫ్‌గా ఉండడంతో ఫారుఖ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు 12వ తేదీన మంగళగిరి చేరుకుని నగరంలోని ఆక్టోపస్ కార్యాలయానికి బషీరున్‌ను తీసుకుని వెళ్లారు. ఆక్టోపస్ కార్యాలయంలో అధికారులకు జరిగిన విషయం చెప్పడంతో ఫారుఖ్ ఈనెల 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు సెలవు పెట్టి ఉన్నాడని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని ఏల్చూరులో ఉన్న కస్తూరిబా గాంధీ గురుకుల బాలికా విద్యాలయాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి సోమవారం సందర్శించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థినులకు అంబేడ్కర్ చరిత్ర గురించి వివరించారు. ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధన చేయాలని ఉపాధ్యాయులకు చెప్పారు. బాలల హక్కుల గురించి వివరించారు. పదో తరగతి పాసైన విద్యార్థినులకు కేజీబీవీలోనే ప్రవేశాలు కల్పించే విధంగా సమగ్ర శిక్ష, విద్యాశాఖను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన తప్పనిసరి



చీరాల అర్బన్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వీవీ రామకృష్ణ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిబ్బంది అగ్నిమాపక పతాకానికి గౌరవ వందనం చేశారు. అగ్నిమాపక శాఖలో పనిచేసి అమరులైన సిబ్బందికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అగ్నిప్రమాదాల నియంత్రణలో ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. చిన్న చిన్న అగ్నిప్రమాదాలను ముందుగానే గుర్తించి వాటిని నివారించవచ్చన్నారు. సరైన అవగాహన లేకపోవడం వలనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అగ్నిప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనం వచ్చే సమయంలోగా ప్రాథమికంగా ప్రజలే స్వయంగా మంటలు అదుపుచేసేందుకు పలు రకాల చర్యలు చేపట్టాలన్నారు. 1944 ఏప్రిల్ 14న ముంబైలోని దాల్ యార్డులో జరిగిన అగ్నిప్రమాదంలో 336 మందితోపాటు 66 మంది సిబ్బంది కూడా మరణించారని, వారి స్మృతికి చిహ్నంగా ఏప్రిల్ 14వ నుంచి 20వ తేదీ వరకు దేశమంతటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం యాప్‌లో వివరాలు ధ్రువీకరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్ పరిధిలో అన్ని యాజమాన్యాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 హెచ్ఎంలతోపాటు అన్ని కేడర్లకు చెందిన ఉపాధ్యాయులు తమ సర్వీసు వివరాలను టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) ఫేషియల్ యాప్‌లో సరిచూసుకుని, ఓటీపీ ద్వారా తక్షణమే ధ్రువీకరించాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటీపీ వారి ధ్రువీకరించిన ఉపాధ్యాయుల సర్వీసు ప్రొఫైల్ వివరాల ఆధారంగానే భవిష్యత్తులో బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించబడతాయని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలతో హెచ్ఎం, ఎంఈవో కార్యాలయాల ద్వారా ఆయా జిల్లాల విద్యాశాఖాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో మంగళవారం సాయంత్రం 5.00 గంటల లోపు సమర్పించాలని సూచించారు.

అమర్‌నాథ్ యాత్రికులకు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: అమర్‌నాథ్ యాత్రికులకు గుంటూరు జీజీహెచ్‌లో మెడికల్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ తెలిపారు. యాత్రకు వెళ్లేవారు మెడికల్ సర్టిఫికెట్ నమూనా రెండు కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు, వయస్సు ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి ఆధార్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకు రావాలన్నారు. ప్రతి బుధవారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల మధ్యలో సర్టిఫికెట్ల కోసం రావాలన్నారు. యాత్రకు వెళ్లేవారి వయస్సు 13 నుంచి 75 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఆరు వారాలు నిండిన గర్భిణులకు యాత్రకు అర్హత లేదన్నారు. యాత్రకు వెళ్లాల్సిన వారు మెడికల్ సర్టిఫికెట్ కోసం రూ.1500 జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో హెచ్‌డీఎస్ కౌంటర్‌లో చెల్లించాలని తెలిపారు. ఈనెల 16 నుంచి సర్టిఫికెట్ల మంజూరు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9963766638 నంబరులో సంప్రదించాలని సూచించారు.